ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
మంగళవారం | ఆగస్టు 25, 2026 | సంపుటి : 7 | సంచిక : 74 | పేజీలు : 2




## ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయాలి

- తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి
- సర్పంచ్ ల సమస్యలపై సీఎంను కలుస్తాం
- వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా గుగులోతు వినోద రవీందర్ నాయక్ బాధ్యతలు




### పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాలి

కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. "పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర

## కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని అడ్డుకోలేదు

- తెలంగాణపై వివక్ష ఎందుకు?
- గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. నన్ను అడ్డుకుంటారా?
- తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై కేంద్రంపై మండిపడ్డ సీఎం రేవంత్ రెడ్డి
- 4కోట్ల మంది తెలంగాణ ప్రజలకు అవమానం
- మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం ఆగ్రహం

**హైదరాబాద్, ఆయుధం:** వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు.

### బీజేపీ నేతలు తప్పదోవ పట్టించారు!

లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా (మిగతా 2 లో..)




### మ్యాపింగ్ కాని ఓటర్లకు
# నోటీసులు

## 27న పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు

- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, ఆయుధం:** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు/వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద ఫారం 6, ఫారం7, ఫారం8 తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రామ సభ/వార్డు సభలో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలని అన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... హనుమకొండ జిల్లాలో ఒక లక్ష ముప్పై రెండు వేల మంది ఎస్ఐఆర్ లో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్నవారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలియజేశారు. నోటీసులు జారీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాను ఈ నెల 27వ తేదీన నిర్వహించే గ్రామసభలలో అధికారులు చదివేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నోటీసుల జారీ, పంపిణీ, యాప్‌లో వివరాల అప్‌లోడ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి ఏఈఆర్ఓ నుంచి వేగవంతమైన చర్యల కోసం కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్, పంపిణీ, అప్‌లోడ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీసీ లో ఆర్డీవో వెంకటేష్, ఏఈఆర్వోలు రవీందర్ రెడ్డి, రాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పాల్గొన్నారు.



## కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత

- నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే నాయిని
- పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం..
- అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం..
- 4 వ డివిజన్ లో 1.19 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హనుమాకొండ, ఆయుధం:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 4వ డివిజన్ పరిధిలోని జ్యోతిబాస్ నగర్, పెద్దమ్మగడ్డ, అక్షర కాలనీ తదితర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం సుమారు రూ.1.19 కోట్లతో నిధులతో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ 4వ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చేపట్టిన పనులకు కాలపరిమితిని నిర్దేశించి నెల రోజుల్లోగా పనులను పూర్తి చేసే విధంగా అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు (మిగతా 2 లో..)

# టార్గెట్ సెప్టెంబర్

## వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి సురేఖ
- నేడు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలి
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ములుగు, ఆయుధం:** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం, వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, డిఎఫ్ఓ వికాస్ మీనా తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.






## 30న నీట్(పీజీ) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్




## అర్జీలకు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

**ములుగు, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి.

## చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు




## ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- బల్దియా కమిషనర్ వెంకన్న

**వరంగల్, ఆయుధం:** ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం గత వారం ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులను విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా, నిర్దేశిత గడువులో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 72 దరఖాస్తులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ కు 30, ఇంజినీరింగ్ కు 15, హెల్త్ అండ్ శానిటేషన్05, రెవెన్యూ14, నీటి సరఫరా 07, హార్టికల్చర్ 01 చొప్పున మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.



అనంతరం అధికారులతో కమిషనర్ పన్నుల వసూళ్లపై సమీక్షిస్తూ పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన పన్ను వసూలు లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా సెప్టిక్ ట్యాంకుల శుభ్రతపై అధికారులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. నగరంలోని అమ్మవారిపేటలో ఇటీవల 150 కేఎల్‌డీ సామర్థ్యంతో సెప్టిక్ ట్యాంక్ మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం (మిగతా 2 లో..)

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర

(మొదటి పేజీ తరువాయి..)
చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. కేంద్ర విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు కొందరు నా పర్యటన వివరాలను తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ మాట్లాడారు. భాజపా నేతల గురించి నేను ఇక్కడ మాట్లాడదలచుకోలేదు. ఇది రెండు ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు సంబంధించిన అంశం. రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా ప్రభుత్వాలు నిర్వహించాల్సిన బాధ్యత గురించి కేంద్రానికి గుర్తు చేయదలచుకున్నాను. కొందరు భాజపా నేతలు నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

## 'రాజకీయ కారణం' అంటే ఏమిటి?

నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

## నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

## మేం అమెరికా వెళ్లకూడదా?

నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

## తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి

తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# ఏడో రోజూ కొనసాగిన నిరసన

- నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో పాలిటెక్నిక్ విద్య పరిరక్షణకు పిలుపు

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ (TPJAC) పిలుపు మేరకు, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను SHAKTIలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హనుమకొండ వద్ద TPJAC వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం ఏడో రోజూ లంచ్ విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వరుసగా ఏడో రోజు కొనసాగుతున్న ఈ నిరసనలో సిబ్బంది "పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి – SHAKTIలో విలీనాన్ని నిలిపివేయాలి" అంటూ నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ ప్రత్యేకత, స్వయంప్రతిపత్తి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, SHAKTIలో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని TPJAC వరంగల్ యూనిట్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్య అనేది కేవలం నైపుణ్య శిక్షణా కేంద్రం కాదని, ఇంజినీరింగ్ విద్యలో కీలకమైన అకడమిక్ విద్యా వ్యవస్థ అని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య ఉన్నత ఇంజినీరింగ్ విద్యకు ఒక ముఖ్యమైన మార్గమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, సాంకేతిక విద్యా రంగ ప్రయోజనాలు మరియు పాలిటెక్నిక్ కళాశాలల ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు శాంతియుత నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల సిపిఐ దిగ్భ్రాంతి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**హనుమకొండ, ఆయుధం:** సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, శోకాన్ని కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర విచారానికి గురయ్యాని తెలిపారు. రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ మల్లారెడ్డి రైతు కూలీల, పేదల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప ప్రజా నాయకుడని, ఆయన మరణం కమ్యూనిస్టు రంగానికి, ముఖ్యంగా రైతు ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సిపిఎం శ్రేణులకు సిపిఐ తీవ్ర సంతాపం తెలుపుతున్నదని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ



**వరంగల్, ఆయుధం:** కొత్తవాడలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి బ్యాచ్ మహిళలకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 ప్రాజెక్ట్ చైర్మన్ బేతి అశోక్ బాబు, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. మహిళలకు ఈ కుట్టు శిక్షణ కార్యక్రమం ద్వారా ఆర్థిక వెసలు బాటు కలిగి ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు. ఆర్గనైజర్లు గజ్జెల కావ్య, ఆడెపు శిరీష, చిప్ప కావ్య లు మాట్లాడుతూ సెంటర్ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేసిన చిప్ప వెంకటేశ్వర్లుకు, సహకరించిన రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటి వరకు 100 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయాలి

- సర్పంచ్ ల సమస్య లపై సీఎంను కలుస్తాం
- ప్రతి పనికి.. ఉప సర్పంచ్ లతో ఇబ్బందులు....
- తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి
- వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా గుగులోతు వినోద రవీందర్ నాయక్ బాధ్యతలు



**హనుమకొండ, ఆయుధం:** గ్రామ పంచాయతీలలో ఉప సర్పంచ్ ల చెక్ పవర్ ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్ లో సోమవారం ఏర్పాటు చేసిన వరంగల్ జిల్లా సర్పంచుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2018లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో వల్ల సర్పంచ్ లతో పాటు ఉప సర్పంచ్ లకు కూడా చెక్ పవర్ కల్పించడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు సర్పంచులుగా ఉన్న గ్రామాల్లో ఉప సర్పంచుల పెత్తనం భరించలేకుండా ఉందని తెలిపారు. ప్రతి చిన్న పనికి, ప్రతి బిల్లుకు, సంతకం పెట్టే ప్రతి చోటా ఉప సర్పంచులు అడ్డుపుల్లలు వేస్తున్నారని, రాజకీయ కక్షలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. సర్పంచ్ కు ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే, అధికారం మాత్రం ఉప సర్పంచ్ చెలాయించడం ఏంటని ప్రశ్నించారు. అందుకే ప్రభుత్వం వెంటనే 2018 జీవోను సవరించి, సర్పంచులకు మాత్రమే పూర్తి చెక్ పవర్ ఉండేలా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు.
గ్రామ స్వరాజ్యం అంటే సర్పంచ్ కే పూర్తి అధికారాలు ఉండాలని, ఉప సర్పంచ్ వ్యవస్థను కేవలం సహకారానికే పరిమితం చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలో ముఖ్యమంత్రిని, పంచాయతీరాజ్ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

### జిల్లా అధ్యక్షుడిగా గుగులోతు వినోద రవీందర్ నాయక్

అనంతరం వరంగల్ జిల్లా తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు గా గుగులోతు వినోద రవీందర్ నాయక్ ను జిల్లాలోని సర్పంచులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధ్యక్ష బాధ్యతలు ఘనంగా చేపట్టారు. సమావేశానికి వచ్చిన రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు నూతన జిల్లా అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచుల ఐక్యత కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని, ప్రభుత్వంతో తమ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని నూతన అధ్యక్షులు గుగులోతు వినోద రవీందర్ నాయక్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అశోక్ రావు, స్టేట్ జనరల్ సెక్రటరీ ఎం. సంపత్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్, జనగాం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాకేష్ రెడ్డి, ములుగు జిల్లా కన్వీనర్ కుమార్ గౌడ్, సంగెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాసరావు, నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రమేష్‌నాయక్, మోహన్ లాల్, బాలు నాయక్, వివిధ మండలాల నుండి వచ్చిన వందలాది మంది సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు



**వరంగల్, ఆయుధం:** వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ మిల్స్ కాలనీ, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా సోమవారం అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత తెలిపారు. నిందితుడి నుండి సుమారు 12 లక్షల విలువ గల 70.19 గ్రాముల బంగారు అభరణాలు, 527.9 గ్రాముల వెండి, 29,875 రూపాయలు నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపిఎస్ అదేశాల ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కాలంగా జరిగిన చోరీలను విశ్లేషణ చేయగా సోమవారం ఉదయం ఒక అనుమానిత వ్యక్తిని అదుపులో తీసుకోని విచారించగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల, (27) నివాసం పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం మహారాష్ట్ర లోని చంద్రపూర్‌లో నివాసం వుంటున్న నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాని తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ రోజు ఉదయం మిల్స్ కాలనీ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్టు నిందితుడు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోని విచారించగా నిందితుడు పగటి సమాయల్లో తాళం వేసివున్న ఇండ్లను గుర్తించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడు. ఇదే రీతిలో నిందితుడు 2024, 2025 మహారాష్ట్రలో మొత్తం నాలుగు చోరీలకు పాల్పడటంతో నిందితుడిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించగా, బెయిల్ పై జైలు విడుదలయినాడు.
నిందితుడు జైలు నుండి విడుదల ఆయిన అతనిలో ఎలాంటి మార్పురాకపోవడం మరో మారు నిందితుడు ఈ సంవత్సరం మిల్స్ కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర్ నగర్ ప్రాంతంలో తాళం వేసి వున్న ఇండ్లల్లో వరుస చోరీలకు పాల్పడినట్లుగా నిందితుడు విచారణలో వెల్లడించాడు. చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్‌కాలనీ ఇన్స్ స్పెక్టర్ స్వామి, ఎస్. ఐ మహేష్, ఏ. ఏ.ఓ సల్మాన్ పాషా తో పాటు ప్రింగ్ సిసి ఎస్. మిల్స్ కాలనీ సిబ్బందిని వరంగల్ సీపీ అభినందించారు.

# టార్గెట్ సెప్టెంబర్

(మొదటి పేజీ తరువాయి..)
ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.
అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి, కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.
మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఆర్ డి ఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత కీలకం



**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో విద్యార్థుల అభివృద్ధి, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేట ప్రధానోపాధ్యాయులు రఫీక్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డా. అనితారెడ్డి పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా. అనితా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఇంట్లోనే కాకుండా పాఠశాలలో కూడా ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలకు చిన్ననాటి నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, మంచి చెడుల మధ్య తేడా తెలుసుకోవడం వంటి విషయాలను తల్లిదండ్రులు బోధించాలన్నారు. పిల్లల స్నేహ సంబంధాలను కూడా తల్లిదండ్రులు గమనిస్తూ, వారి భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి స్నేహాలను ప్రోత్సహించాలని తెలిపారు, పిల్లలతో తల్లిదండ్రులు సమయం గడపాలని, పిల్లలకు నిత్యం మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా, వాటి వినియోగంపై తల్లిదండ్రులు నియంత్రణ పాటించాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి, వారి సూచనలు పాటిస్తూ, పెద్దలు బోధించే మంచి నైతిక విలువలను తమ జీవితంలో ఆచరించాలని, అదేవిధంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరించే తెలియని వ్యక్తులు కనిపించినప్పుడు వారి వద్దకు వెళ్లకుండా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థుల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు, మాజీ బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వరంగల్ మండల పరశురాములు, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మపతి, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 30న నీట్ (పీజీ) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ఈ నెల 30న జరగనున్న నీట్ (పీజీ) 2026 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 30వ తేదీన జరగనున్న నీట్ (పీజీ) 2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్ టి ఏ నీట్ (పీజీ) 2026 కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ఈ నెల 30వ తేదీ (ఆదివారం)న ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (తిరుమల్ రెడ్డి కన్వెన్షన్ హాల్ ఎదురుగా, హైవే పక్కన హసన్ పర్తి), మోక్షిత్ కంప్యూటర్స్ (పొద్దుటూరు గార్డెన్స్ (రామారం, కరీంనగర్ రోడ్డు), అయాన్ డిజిటల్ జోన్ (ఫిల్టర్ బెడ్, వడ్డేపల్లి) కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో ముగ్గురు అధికారులను పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా, ఒకరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా, ముగ్గురిని సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. పరీక్ష దృష్ట్యా కేంద్రాలలో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 8:30 తరువాత పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులకు అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిసిపి దార కవిత, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీ శంకర్, ఎన్పీడీసీఎల్ ఏఈ అలేఖ్య, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాజు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అయిప్సో జిల్లా కమిటీ ఎన్నిక

**హనుమకొండ, ఆయుధం:** ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించాలని దురాహంకారంతో సామ్రాజ్యవాద దేశాలు వెనుకబడిన దేశాలపై యుద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా పీస్ అండ్ శాలిడారిటీ ఆర్గనైజేషన్ ప్రపంచ శాంతి కోసం పని చేస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు. ఇరాన్ పై అమెరికా పాలస్తీనా గాజుపై ఇజ్రాయిల్ ఉక్రెయిన్ పై రష్యా సామ్రాజ్యవాద కాంక్షతో యుద్ధం చేయడానికి అయిప్సో సభ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సభ నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయిప్సో హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా మాదాసి బాబు, ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి ప్రవీణ్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా నేదునూరి రాజమౌళి, చీఫ్ పాట్రన్స్ గా మేడిపల్లి శోభన్ బాబు, యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షులుగా కామెర వెంకటరమణ, వేణుగోపాల్ అడ్వకేట్, కుమారస్వామి, డాక్టర్ కే ప్రసాద్, సహాయ కార్యదర్శిగా దామోదర్, వై సంజయ్. ఎన్పీడీసీఎల్ ఏడి జానయ్య, సలహాదారులుగా రాజమహమ్మద్, రామ్ బ్రహ్మం, రామ్మూర్తి, రహీం పాషా, తోట సుధాకర్ ఎన్నిక కావడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీకి సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మాలోత్ శంకర్ శుభాకాంక్షలు తెలిపారు.

# కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి..)
ఇచ్చారు. జ్యోతిబాస్ నగర్ కాలనీలో ఇప్పటికే ప్రధాన రహదారులు అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, మిగిలి ఉన్న మరో రెండు చిన్న గల్లీల్లో కూడా ఈ నెలలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వ్యవస్థ తదితర అంశాల్లో ఎక్కడా సమస్యలు లేకుండా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.
ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలుకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీ అభివృద్ధి పనులకు ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో కూడా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీని దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి..)
చేయించుకోవాలని, నగరంలో నివసించే బల్దియా అధికారులు తమ గృహాల్లోని సెప్టిక్ ట్యాంకులను కూడా నిర్ణీత వ్యవధిలో శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఇది కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య నిర్వహణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి మల వ్యర్థాల సేకరణ కోసం బల్దియా 29 సెప్టిక్ ట్యాంకర్ వాహనాలకు అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. అధికారులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అద్దె ఇళ్లలో నివసించే అధికారులు సంబంధిత ఇంటి యజమానులు కూడా నిర్ణీత వ్యవధిలో సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకునేలా ప్రోత్సహించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695